# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 19-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ గ్లోబల్ సౌత్ సాధికారతకు కృత్రిమ మేథ (ఏఐ) ఒక సాధనంగా మారాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు.

❖ సురక్షితమైన భవిష్యత్ కోసం ప్రపంచ దేశాల నావికాదళాల మధ్య సహకారం ఆవశ్యకమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

❖ "ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ -2026"లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు దేశాధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు.

❖ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ రూపకల్పనలో కీలక ఖనిజాల ప్రాముఖ్యత పెరుగుతోందని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గ్లోబల్ సౌత్ సాధికారతకు కృత్రిమ మేథ (AI) ఒక సాధనంగా మారాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. ఇండియా AI ఇంపాక్ట్ సమ్మిట్-2026 కార్యక్రమాన్ని న్యూఢిల్లీలో ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. ప్రపంచం ప్రస్తుతం మానవులు మేధో వ్యవస్థలు కలిసి పనిచేసి, అభివృద్ధి చెందే కాలంలోకి ప్రవేశిస్తోందన్నారు. భారతదేశం కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేయడంతో పాటు దానిని వేగంగా స్వీకరిస్తుందని, భారత్.. ప్రపంచంలోనే అతిపెద్ద టెక్ పూల్‌కు కేంద్రంగా ఉందని వివరించారు. మానవ చరిత్రలో AI.. ఒక పరివర్తనాత్మక అధ్యాయాన్ని సూచిస్తుందని, దీనిని ప్రజాస్వామ్యీకరించవలసిన అవసరం ఎంతైనా ఉందని వ్యాఖ్యానించారు. AI యంత్రాలకు తెలివిని అందిస్తుందని.. అలాగే మానవ సామర్థ్యాలను అనేక రెట్లు పెంచుతోందని చెప్పారు. భారత్‌లో AI సమ్మిట్ నిర్వహించడం దేశానికి, అలాగే గ్లోబల్ సౌత్‌కు గర్వకారణమని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సముద్రంలో ఉత్పన్నమవుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జరిగిన మిలన్ ప్రారంభోత్సవంలో 74 దేశాల నేవీ చీఫ్‌లు, ప్రతినిధులను ఉద్దేశించి ఆయన ఈరోజు మాట్లాడుతూ... అంతర్జాతీయంగా శాంతిని నెలకొల్పడంలో నావికాదళాల పాత్ర పెరిగిందన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా ఆర్థిక వృద్ధి గణనీయంగా పెరిగిందని, దీనివల్ల అంతర్జాతీయ వాణిజ్యం, రవాణాలో భారీ పెరుగుదల వచ్చిందని చెప్పారు. సముద్ర తలంలో ఉగ్రవాదం, అక్రమ కార్యకలాపాలు, రవాణా మొదలైన అనేక సమస్యలు ఉన్నాయని, వీటి నుండి మన జలాలను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్ఘాటించారు. ఎంత సామర్థ్యం ఉన్నప్పటికీ.. ఏ ఒక్క నావికాదళం ఈ సవాళ్లను ఒంటరిగా పరిష్కరించలేదని, సురక్షితమైన భవిష్యత్ కోసం నావికాదళాల మధ్య సహకారం చాలా అవసరమని రక్షణ మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

=========================

న్యూఢిల్లీలో జరుగుతున్న ఇండియా AI ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇద్దరు నాయకులు ద్వైపాక్షిక సహకారం గురించి చర్చించారని, వివిధ రంగాలలో సాధించిన పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. భారతదేశం-యూఏఈ సంబంధాలకు ఆధారమైన చారిత్రక సంబంధాలను గుర్తు చేసుకుంటూ.. కృత్రిమ మేధస్సులో సహకారాన్ని పెంపొందించే మార్గాలను కూడా వారు చర్చించారు. ఈ శిఖరాగ్ర సమావేశంలో ప్రధానమంత్రి మోదీ.. నెదర్లాండ్స్ ప్రధానమంత్రి డిక్ స్కూఫ్‌తో కూడా ద్వైపాక్షిక సమావేశం నిర్వహించి, ఆర్థిక, సామాజిక పరివర్తనకు వీలు కల్పించే సాధనంగా AIని ఉపయోగించడంపై ఇరువురు నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

విరామం

=========================

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ రూపకల్పనలో ఖనిజాల ప్రాముఖ్యత పెరుగుతోందని కేంద్ర బొగ్గు, పెట్రోలియం శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజ జరిగిన `ఇండియన్ క్రిటికల్ మినరల్స్ ల్యాండ్‌స్కేప్: ఫౌండేషన్ ఫర్ ఎ సస్టైనబుల్ ఫ్యూచర్` రెండవ సంచిక ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడారు. సౌరశక్తి, లిథియం, రాగి ఆధారిత సాంకేతికత వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలకు కీలకమైన ఖనిజాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

=========================

ప్రజలు పనిచేసే విధానాన్ని, నేర్చుకునే విధానాన్ని మార్చే సాంకేంతిక పునాది  కృత్రిమ మేథ అని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `ఇండియా AI ఇంపాక్ట్ సమ్మిట్-2026` శిఖరాగ్ర సమావేశానికి హాజరైన ప్రపంచ నాయకులకు కేంద్రమంత్రి స్వాగతం పలికారు. ప్రభుత్వం కంప్యూట్‌ను ప్రజా ప్రయోజనంగా పరిగణిస్తుందని, స్టార్టప్‌లు, పరిశోధకులు, విద్యా సంస్థలు, విద్యార్థులకు సరసమైన ధరలకు కామన్ కంప్యూట్ ప్లాట్‌ఫామ్‌ను ప్రభుత్వం రూపొందించిందని చెప్పారు. సాంకేతికత నిజమైన విలువ దాని ప్రయోజనాలు ప్రజలకు చేరేలా చూసుకోవడంలో ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశ్వాసమని అశ్విని వైష్ణవ్ పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు రేపు సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈరోజు జరిగిన ఇండియా AI ఇంపాక్ట్ సమ్మిట్ 2026 ప్రారంభోత్సవ కార్యక్రమానికి టెక్నాలజీ రంగానికి చెందిన భారీ సంస్థల CEOలు హాజరయ్యి కృత్రిమ మేధపై తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు. టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మాట్లాడుతూ... AI ని తదుపరి మౌలిక సదుపాయాల పునాదిగా అభివర్ణించారు. ఆంత్రోపిక్ CEO డారియో అమోడీ మాట్లాడుతూ... 2023లో బ్లెచ్లీ పార్క్‌లో జరిగిన మొదటి గ్లోబల్ AI సేఫ్టీ సమ్మిట్ నుండి AI అతి వేగంగా పురోగమించిందని అన్నారు. AI ని జీవితకాలంలో అతిపెద్ద ప్లాట్‌ఫామ్ షిఫ్ట్‌గా గూగుల్ CEO సుందర్ పిచాయ్ అభివర్ణించారు. AI అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని, అందరూ ధైర్యంగా, బాధ్యతాయుతంగా దీనిని అనుసరించాలని సూచించారు. 22 అధికారిక భాషలు, అనేక మాండలికాలు ఉన్న భారతదేశ సంస్కృతి, వైవిధ్యంపై తమ సంస్థ దృష్టి సారించిందని సర్వం AI సహ వ్యవస్థాపకుడు డాక్టర్ వివేక్ రాఘవన్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉచితాల సంస్కృతి దేశ ఆర్థికాభివృద్ధికి ఆటంకం కలిగిస్తోందని సుప్రీం కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. దేశంలోని చాలా రాష్ట్రాల్లో  రెవెన్యూ లోటు ఉన్నప్పటికీ, ఉచితాలను అందిస్తున్నాయని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మల్య బాగ్చి, విపుల్ ఎం.పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈరోజు వ్యాఖ్యానించింది. వినియోగదారుల ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా అందరికీ ఉచిత విద్యుత్ అందించాలన్న తమిళనాడు విద్యుత్ పంపిణీ కార్పొరేషన్ లిమిటెడ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. అందరికీ ఉచితంగా ఆహారం, సైకిళ్లు, విద్యుత్ ఇవ్వడానికి బదులుగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్రాలు కృషి చేయాలని ధర్మాసనం సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =